
www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 10 మే 2023
5
పశ్చిమ గోదావరి



12న జిల్లాకు చంద్రబాబు రాక

ఇరగవరం నుంచి తణుకు వరకూ పాదయాత్ర

వైజంక్షన్‌లో బహిరంగ సభ



ప్రజాశక్తి - తణుకు

టిడిపి అధినేత చంద్రబాబు ఈ నెల 12న తేతలి వైజంక్షన్ వద్ద నిర్వహించే బహిరంగ సభలో పాల్గొంటున్నారు. రైతు పోరుబాట కార్యక్రమంలో భాగంగా ఈ సభ నిర్వహిస్తున్నట్లు మాజీ ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ తెలిపారు. తొలుత చంద్రబాబు ఇరగవరం మండలం నుంచి తణుకు వై.జంక్షన్ వరకు పాదయాత్ర చేయనున్నారని తెలిపారు. ఈ పాదయాత్ర సుమారు 12 కిలోమీటర్లు సాగుతుందని, అనంతరం సభలో పాల్గొంటారని చెప్పారు.

అన్నదాత ఆక్రందన..!

ఇంకా వీడని ధాన్యం కొనుగోలు సమస్యలు

కైకరంలో సంచుల కోసం రైతుల పడిగాపులు

లారీలు కావాలంటే ముందుగా సొమ్ము చెల్లించాల్సిందే

అధికారుల ప్రణాళికా లోపంతో రైతులకు కష్టాలు

25 రోజులైనా అపరిష్కృతంగానే సమస్యలు



కైకరం రైతుభరోసా కేంద్రంలో సంచుల కోసం రైతుల పడిగాపులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి


ధాన్యం కొనుగోలు సమస్యలు ఇప్పటికీ కొలిక్కిరాని పరిస్థితి నెలకొంది. ఇప్పటికీ అన్నదాత ఆక్రందనలు మిన్నంటుతూనే ఉన్నాయి. సంచుల కోసం రైతుభరోసా కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు పడుతూనే ఉన్నారు. ధాన్యం కొనుగోలు ప్రారంభించి 25 రోజులు దాటినా సమస్యలు మాత్రం పరిష్కారం కాలేదు. ధాన్యం కొనుగోలులో ప్రణాళికాలోపంతో రైతులకు ప్రభుత్వం ఎనలేని కష్టాలు సృష్టించింది. రైతులు వ్యవసాయం చేయాలంటేనే భయపడే పరిస్థితికి తీసుకొచ్చారు. ఏలూరు జిల్లావ్యాప్తంగా రబీలో 79 వేల ఎకరాల్లోనే రైతులు వరి సాగు చేశారు. ఏలూరు జిల్లాలో నిడమర్రు, ఉంగుటూరు, భీమడోలు, దెందులూరు మండలాల్లోనే అత్యధికంగా వరి సాగు జరిగింది. 3.90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఈ ధాన్యం కొనుగోలు చేయడంలో కూడా అధికారులు విఫలమయ్యారు. సంచులు, లారీల కోసం ఇప్పటికీ రైతులు పడుతున్న కష్టాలు అన్నీఇన్నీ కావు. ధాన్యం కొనుగోలు టార్గెట్ తక్కువగా నిర్ణయించి సంచులు ఇవ్వకుండా రైతులను ముప్పుతిప్పలు పెడుతున్నారు. సంచుల నుంచి ధాన్యం కొనుగోలు టార్గెట్ల వరకూ రైతుల నుంచి ఒత్తిడి వచ్చే వరకూ ఎటువంటి నిర్ణయాలూ తీసుకోకుండా కాలయాపన సాగించారు. దీంతో అనేక ఇబ్బందులు రైతులను ఉక్కిరిబిక్కిరి చేశాయి. పశ్చిమగోదావరి జిల్లాలో 2.13 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. 9.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేసి 6.45 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాలని టార్గెట్‌గా పెట్టుకున్నారు. ధాన్యం కొనుగోలులో ప్రణాళికలు సరిగా లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడాల్సిన దుస్థితి నెలకొంది.

సంచుల కోసం పడిగాపులే..

ధాన్యం కొనుగోలు ప్రారంభించి 25 రోజులు దాటినా రైతులను ఇప్పటికీ సంచుల కొరత వేధిస్తూనే ఉంది. సంచుల కోసం కైకరం రైతుభరోసా కేంద్రంలో మంగళవారం రైతులు పడిగాపులు పడ్డారు. ఎట్టకేలకు కొంతమందికి సంచులివ్వగా, ఇంకా 50 వేలకు పైగా సంచులు అవసరం ఉందని రైతులు చెబుతున్నారు. సంచులు తీసుకెళ్లిన రైతులు ధాన్యం పట్టినా లారీలు మాత్రం రావడం లేదు. లారీ కావాలంటే ముందుగా కిరాయి నిమిత్తం రూ.18 వేలకుపైగా చెల్లించాలని చెబుతున్నారు. ఇప్పటికే వర్షాలతో నానా ఇబ్బందులు పడ్డ రైతులు ఇక కష్టాలు భరించలేక లారీలకు ముందస్తుగా సొమ్ము చెల్లించి ధాన్యం తరలిస్తున్నారు. ఇప్పటికీ కొన్ని రైతుభరోసా కేంద్రాల్లో టార్గెట్ పూర్తయిందంటూ సంచులు ఇవ్వని పరిస్థితి ఉంది. అధికారులు చెబుతున్న మాటలకు క్షేత్రస్థాయిలో పరిస్థితికి సంబంధం లేని పరిస్థితి నెలకొంది. చివరి బస్తా కొనుగోలు చేసేవరకూ ఈ కష్టాలు వీడవా అంటూ రైతులు గగ్గోలు పెడుతున్నారు. రబీ ధాన్యం కొనుగోలులో రైతులు పడ్డ కష్టాలు చూసి అంతా తీవ్ర ఆవేదనకు గురైనా ప్రభుత్వం నుంచి పెద్దగా చలనం లేకపోవడం తీవ్ర విమర్శలకు దారితీసింది. గడిచిన ఖరీఫ్‌లోనూ ఇవే కష్టాలు పునరావృతమైనప్పటికీ రబీలో సమస్యలు లేకుండా ప్రణాళికలు రూపొందించడంలో తీవ్రలోపం కన్పించింది. ఇప్పటికైనా ధాన్యం కొనుగోలులో ప్రభుత్వ తీరు మారకపోతే రైతులు వ్యవసాయానికి దూరమయ్యే పరిస్థితి ఏర్పడనుంది.



పాలకొల్లులో ఎంఎల్‌ఎ, పోలీసుల నడుమ వాగ్వివాదం



తణుకులో వినతి అందిస్తున్న ఆరిమిల్లి రాధాకృష్ణ

ధాన్యం కొనుగోళ్లలో అవినీతి ఆపలేకపోతే సెలవుపై వెళ్లండి

తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నాలో ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు

జిల్లాలో రైతుల నుంచి ధాన్యం అమ్మకాల్లో సొమ్ము గుంజుతున్న మిల్లర్ల దోపిడీని జిల్లా కలెక్టర్ ఆపలేకపోతే సెలవులో వెళ్లాలని ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు డిమాండ్ చేశారు. వర్షాలకు నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.25 వేలు చెల్లించాలని స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ దాసి రాజుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, రాజప్రస్థానం ఒత్తిడి మేరకు రైతుల నుంచి మిల్లర్లు సొమ్ము వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ధాన్యం అమ్మకాల్లో అవినీతి నుంచి రైతులను కలెక్టర్ కాపాడాలని, లేకపోతే సెలవుపై వెళ్లాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఏటిగట్ల నుంచి మట్టి రాత్రి సమయంలో దారుణంగా తరలిస్తున్నారని, ఎన్ని ఆందోళనలు చేస్తున్నా చర్యలు లేవని, ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతుల సొమ్మును దోచేస్తున్న వారిపై కనీసం ఐఎఎస్ అధికారులు కూడా చర్యలు తీసుకోకపోతే ఎలాగని ప్రశ్నించారు. ఇప్పటికే అక్రమాలకు పాల్పడిన ఏడుగురు మిల్లర్లపై చర్యలు తీసుకున్నామని, రుజువైతే మిగిలిన వారిపైనా చర్యలు తీసుకుంటామని ఆర్‌డిఒ హామీ ఇచ్చారు. ఈ ఆందోళనలో ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, టిడిపి నేతలు పెచ్చెట్టి బాబు, జివి, కడలి గోపి తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత

స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద టిడిపి నేతలతోపాటు రైతులు, పోలీసుల నడుమ మంగళవారం ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు, ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ ఆధ్వర్యంలో ధర్నా సందర్భంగా తహశీల్దార్ కార్యాలయంలోకి రైతులను అనుమతించలేదు. దీనిపై బయట ఉండి రైతులు నినాదాలు చేస్తుండగా పట్టణ సిఐ రాంబాబు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై నిమ్మల అభ్యంతరం వ్యక్తం చేస్తూ రైతుల బాధలు చెప్పుకుంటే అడ్డుకోవడానికి మీరెవరంటూ ప్రశ్నించారు. దీంతో పోలీసులు, రైతుల మధ్య వాగ్వివాదం, తోపులాట చోటుచేసుకుంది. ఈ సమయంలో నిమ్మల, అంగర ఉరితాళ్లు మెడలో వేసుకుకోగా దాన్ని పోలీసులు అడ్డుకున్నారు. ఈలోపు నరసాపురం ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ దాసి రాజు అక్కడికి రావడంతో ఆయనకు వినతిపత్రం సమర్పించేందుకు పోలీసులు అనుమతిచ్చారు. దీంతో రైతుల నుంచి అక్రమంగా వసూలు చేస్తున్న సొమ్ము తిరిగి రైతులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రూరల్ సిఐ శ్రీనివాస్, పెనుగొండ సిఐ నాగేశ్వరరావు, పలువురు ఎస్ఐలు బందోబస్తు నిర్వహించారు.

పాలకోడేరు: ఆరుగాలం కష్టించి వ్యవసాయం చేస్తున్న రైతులను వైసిపి ప్రభుత్వం నెట్టేట ముంచిందని ఉండి ఎంఎల్‌ఎ మంతెన రామరాజు విమర్శించారు. రైతులు పండించిన చివరి ధాన్యపు గింజ ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేసేవరకూ రైతులకు అండగా పోరాటం సాగిస్తామని స్పష్టం చేశారు. 'పంట మునిగింది.. పరిహారం ఇప్పించండి' పేరుతో టిడిపి చేపట్టిన నిరసనలో భాగంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ రామరాజు మాట్లాడుతూ తేమ, నూకశాతం పేరిట మిల్లర్లు రైతుల వద్ద నగదు వసూళ్లకు పాల్పడటాన్ని అరికట్టాలన్నారు. 40 కేజీల బస్తాకు 42 కేజీలు తూయించుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రైతు సమస్యలపై ఈ నెల 11న జిల్లా కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న నిరసన కార్యక్రమానికి పెద్దఎత్తున రైతులు తరలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం తహశీల్దార్ షేక్ హుస్సేన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షుడు దెందుకూరి ఠాగూర్ కోటేశ్వరరాజు, మాజీ ఎంపిపి పాలా వెంకటచలపతి, శ్రీనివాసరాజు, దొంగ కృష్ణ, సాంబ్రాణి సంకురుడు, మాధవ, నడిపూడి అప్పారావు, ఇళ్ల పండు, రైతులు పాల్గొన్నారు.



పాలకోడేరులో నినదిస్తున్న ఎంఎల్‌ఎ మంతెన రామరాజు

మంత్రి వ్యాఖ్యలను ఖండించిన ఎంఎల్‌ఎ

రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ఇటీవల రైతులపై చేసిన వ్యాఖ్యలను ఎంఎల్‌ఎ మంతెన రామరాజు ఖండించారు. అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతుల గోడు వినే ఓపిక కూడా ఈ మంత్రులకు లేదని విమర్శించారు. రైతుల సమస్యలు గాలికొదిలేసి, రైస్‌మిల్లర్లతో కుమ్మక్కై, తిరిగి రైతులపైనే అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైంది కాదన్నారు.

ఉండి: మిల్లర్ల దోపిడీని అరికట్టి రైతులకు న్యాయం చేయాలని టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కిన్నెర వెంకన్న డిమాండ్ చేశారు. టిడిపి ఆధ్వర్యాన స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి డిప్యూటీ తహశీల్దార్ ఎస్.వీరాస్వామినాయుడుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కిన్నెర వెంకన్న మాట్లాడుతూ రైతుభరోసా కేంద్రాల్లో తేమ శాతాన్ని పరిశీలించి రైస్ మిల్లుల వద్దకు రైతు ధాన్యాన్ని తీసుకెళ్తుంటే మిల్లర్లు తేమశాతం అధికంగా ఉందని చూపించి డబ్బు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. రైతులు గుండుగొల్లు పెద్దిరాజు, గెద్దా అప్పారావు, కొండయ్య తదితర రైతులు డిప్యూటీ తహశీల్దార్‌కు మిల్లర్ల దోపిడీపై ఫిర్యాదు చేశారు. దీనిపై డిప్యూటీ తహశీల్దార్ ఎస్.వీరాస్వామినాయుడు మాట్లాడుతూ మిల్లర్ల దోపిడీ గురించి ఇప్పటి వరకు తన దృష్టికి రాలేదన్నారు. దీనిపై కొందరు రైతులు స్పందించి ఇప్పటికే చాలాసార్లు సివిల్ సప్లయిస్ డిటి మహేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. అనంతరం టిడిపి నాయకులు ముదునూరి కృష్ణంరాజు, దూసనపూడి రాంబాబు, గంధం బుజ్జి మాట్లాడుతూ అధికారులు మిల్లర్లకు మద్దతుగా మాట్లాడటం సరికాదన్నారు. మిల్లర్ల దోపిడీ గురించి రైతులే వచ్చి ఆధారాలు చూపించినా అధికారులు మౌనం వహించడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం తడిచి మొలకెత్తిన ధాన్యాన్ని బేషరతుగా మద్దతు ధరకే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిడిపి నేతలు కాగిత బుజ్జి, బండారు సుబ్బారావు, కునుకు రమాదేవి శ్రీనివాస్, మంతెన సాయిలచ్చిరాజు, చెన్నంశెట్టి హరినాయుడు, గొల్ల జాన్‌కెనడీ విక్టర్‌బాబు, మజ్జి కృష్ణప్రసాద్, లంకా ప్రకాష్, మల్లువలస రవీంద్ర కుమార్, కరిమెరక సత్యం పాల్గొన్నారు.

పోడూరు: అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకొని నష్టపరిహారం అందించాలని కోరుతూ టిడిపి ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ ఆర్‌వి.కృష్ణారావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షులు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, రైతు నాయకులు పెన్మెత్స రామబద్రరాజు, దాసరి రత్నరాజు, కొల్లు రామారావు పాల్గొన్నారు.

తణుకురూరల్: రైతులకు భరోసా కల్పించేలా తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని టిడిపి మాజీ ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద రైతులకు పంట నష్టపరిహారాన్ని అందజేయాలని టిడిపి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కార్యదర్శి తామరపు రమణమ్మ, బిసి సెల్ అధ్యక్షులు గుబ్బల శ్రీనివాస్, రాష్ట్ర ఎస్‌సి సెల్ కార్యదర్శి అబ్బదాసరి లాజర్, రైతుసంఘం అధ్యక్షులు నల్ల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోళ్లు : కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

జిల్లాలో రైతులకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని కలెక్టర్ ప్రశాంతి అధికారులను ఆదేశించారు. మంగళవారం మండలంలోని సీతారామపురం సౌత్ రైతుభరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు సాఫీగా సాగేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి రైస్‌మిల్లులో ఒక ఇఒపిఆర్‌డిని నియమించామని, ఆ అధికారి రైస్‌మిల్లులోనే ఉండి ధాన్యం దిగుమతి చేసుకునేటప్పుడు ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా వారు పర్యవేక్షించాలని కలెక్టర్ అన్నారు. ప్రతి ఆర్‌బికె వద్ద విఆర్‌ఒ, విఎఎ, పంచాయతీ కార్యదర్శి, సీనియర్ ఇన్‌స్పెక్టర్, సహకార శాఖ సిబ్బంది, ఇతర అధికారులను నియమించామని తెలిపారు. రైతులు అవసరమైన గోనెసంచులు, హమాలీలు వాహనాలను రైతుభరోసా కేంద్రాల వద్ద ఏర్పాటు చేశామని, వాటిని పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. రైతులు వద్ద ధాన్యం కొనుగోలు చేసిన వారికి సకాలంలో డబ్బు రైతుల బ్యాంక్ ఖాతాలో నేరుగా జమ చేసినట్లు తెలిపారు. రైతులను ఇబ్బంది పెట్టే రైస్‌మిల్లర్లను ఎవరినీ ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కలెక్టర్ వెంట ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ దాసి రాజు, తహశీల్దార్ ఎస్ఎం.ఫాజిల్, ఎంపిడిఒ ఎన్‌విఎస్.ప్రసాద్‌యాదవ్, వ్యవసాయాధికారులు, రైతులు, ఆర్‌బికె సిబ్బంది పాల్గొన్నారు.



నరసాపురం: అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

మొగల్తూరు : జిల్లాలో ఎక్కడా ధాన్యం కొనుగోలుపై ఫిర్యాదులు రాకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ పి.ప్రశాంతి సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులతో మాట్లాడారు. ఏ సమస్య వచ్చినా వెంటనే స్పందించి తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ దాసి రాజు, ప్రత్యేకాధికారి విజయలక్ష్మి, తహశీల్దారు జి.అనితకుమారి, ఎంపిడిఒ ఆర్‌సి.ఆనంద్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.



భీమవరం కలెక్టరేట్ నుంచి కన్నబాబు, జెడ్‌పి చైర్‌పర్సన్, జిల్లా అధికారులు

సమస్యల పరిష్కారం మెరుగుకే జగనన్నకు చెబుదాం


జిల్లా ప్రత్యేక అధికారి కన్నబాబు

ప్రజాశక్తి - భీమవరం

సమస్యల పరిష్కారమే జగనన్నకు చెబుదాం కార్యక్రమం ముఖ్యోద్దేశమని రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ ప్రత్యేక కమిషనర్, జిల్లా ప్రత్యేక అధికారి కె.కన్నబాబు అన్నారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ పి.ప్రశాంతితోపాటు జిల్లా ప్రత్యేకాధికారి, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాల గురించి ప్రజలు తెలుసుకునేందుకు వీలు కల్పించడంతోపాటు వారి నుండి ఫిర్యాదులు స్వీకరించి సత్వర పరిష్కారానికి జగనన్నకు చెబుదాం ముఖ్యోద్దేశమన్నారు. దీనికోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నెంబరు 1902కు ప్రజలు ఫోన్ చేసి సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్‌పి యు.రవిప్రకాష్, జెడ్‌పి చైర్మన్ కవురు శ్రీనివాస్, ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్, జెసి ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి, డిఆర్‌ఒ కె.కృష్ణవేణి, ఎన్‌ఫోర్స్‌మెంట్ అడిషనల్ ఎస్‌పి రవికుమార్, డిసిసిబి చైర్మన్ పివిఎల్.నరసింహరాజు, డిసిఎంఎస్ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి, డిప్యూటీ ట్రైనీ కలెక్టర్ దేవరకొండ అఖిల, భీమవరం ఎంపిపి పేరిచర్ల విజయ రామరాజు, ఎంఎంసి చైర్మన్ కోటిపల్లి నాగదుర్గామల్లేశ్వరరావు (బాబు), రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామన నాగేశ్వరరావు, జాతీయ బిసి సంఘం జిల్లా అధ్యక్షుడు కోడే యుగంధర్, ఇతర ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పరిరక్షణకే 12న ధర్నా

ప్రజాశక్తి - అత్తిలి



మాట్లాడుతున్న జక్కంశెట్టి సత్యనారాయణ

దశాబ్దాలుగా సాగిన పోరాటాలు, వామపక్షాల కృషి ఫలితంగా మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం వచ్చిందని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చినవీరభద్రరావు తెలిపారు. ఆరవల్లిలో మంగళవారం ఉపాధి కూలీలను కలిసి ఈ నెల 12న ధర్నా కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ దేశంలో వ్యవసాయ రంగానికి మంచి రోజులు తీసుకొస్తానని మాయమాటలు చెప్పిన మోడీ ప్రభుత్వం పోరాడి సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్రలు చేసి పేదలు, కూలీలు నోటికాడ కూడు లాగేయాలని చూస్తుందని విమర్శించారు. ఈ నేపథ్యంలో ఉపాధి హామీ చట్టం పరిరక్షణకు ఈ నెల 12న భీమవరం కలెక్టరేట్ వద్ద జరుగుతున్న మహాధర్నాలో కూలీలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వీరభద్రరావు కోరారు. ఈ కార్యక్రమంలో మల్లిడి నాగిరెడ్డి, నీతిపూడి ధర్మారావు, కొవ్వూరి సత్యవతి, మేడపాటి పాపారావు, వెలగల అమ్మిరెడ్డి, మేడపాటి కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: ఉపాధి హామీ పరిరక్షణకు ఈ నెల 12న భీమవరం కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ ఈ నెల 10, 11 తేదీల్లో రూరల్ మండలంలో ఉపాధి హామీ పరిరక్షణ ఆటో యాత్ర నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు తెలిపారు. ఉపాధి పర్యటనలో భాగంగా మంగళవారం దండగర్ర గ్రామంలో ఉపాధి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. యాత్ర బుధవారం ఉదయం ఏడు గంటలకు ఇటుకలగుంట గ్రామం నుండి ప్రారంభమవుతుందని, యాత్రను జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ ప్రారంభిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో గట్టెం శాంతకుమారి, ఎస్.వల్లి, కె.సత్యలక్ష్మి దుర్గ, మైనం కోటమ్మ, కట్ట గోవర్ధన్, కొనకండ్ల వరలక్ష్మి, మైనం సత్యవాణి, మైనం కనకదుర్గ పాల్గొన్నారు.

పాలకోడేరు: ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ భీమవరం కలెక్టరేట్ వద్ద ఈ నెల 12న చేపట్టిన ధర్మాన్ని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు శేషపు అశ్రియ్య పిలుపునిచ్చారు. ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ శృంగవృక్షం, పెన్నాడ గ్రామాల్లో మోటర్ సైకిల్ ర్యాలీ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్నాలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సుబ్బారావు, కొటికలపూడి శ్రీను, సురేష్, రమేష్, రాంబాబు పాల్గొన్నారు.

నరసాపురం టౌన్: ఉపాధి హామీలో రెండు పూటలా పని విధానాన్ని రద్దు చేయాలని, రోజువారీ వేతనం రూ.600కు పెంచాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద చేపట్టే ధర్నాకు ఉపాధి కూలీలంతా అధిక సంఖ్యలో హాజరు కావాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు కవురు పెద్దిరాజు పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని యర్రంశెట్టివారిపాలెం, లక్ష్మణేశ్వరం, లింగనబోయినచర్ల గ్రామాల్లో ఉపాధి పని ప్రాంతాల్లో వారు పర్యటించారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలతో వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీకి బడ్జెట్లో నిధులు తగ్గించి చట్టాన్ని నీరుగారుస్తుందన్నారు. వేసవిలో ఇచ్చే 20 శాతం అలవెన్స్ ప్రస్తుతం ఎత్తేశారని తెలిపారు. ధరలు పెంచడానికే తప్ప కూలి పెంచడానికి మాత్రం ప్రభుత్వానికి మనసు రావడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కమిటి సభ్యురాలు జి.వెంకటలక్ష్మి, మండల కార్యదర్శి గుబ్బల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పది లక్షల సంచులు అందించా

ఎంఎల్‌ఎ రంగనాధరాజు

ప్రజాశక్తి - ఆచంట

తన నియోజకవర్గంలో ఇబ్బంది పడుతున్న రైతులకు తన సొంత ఖర్చులతో పది లక్షల గోనె సంచులను ఏర్పాటు చేశానని ఆచంట ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాధరాజు అన్నారు. తూర్పుపాలెం ఎంఎల్‌ఎ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా రంగరాజు మాట్లాడుతూ రోజుకు లక్ష యాభై వేల సంచులను రైతులకు అందించేందుకు తనవంతుగా కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. నియోజకవర్గంలో కోతలు ఆలస్యంగా ప్రారంభమయ్యాయని, వర్షాలు కురిసే సమయానికి 30 నుంచి 40 శాతం మాత్రమే కోతలు పూర్తయ్యాయని తెలిపారు. గత వారంలో రెండు, మూడు రోజులపాటు కురిసిన వర్షానికి రైతులు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. రైతులందరికీ సంచులు అందుబాటులో ఉంచుతానని తెలిపారు. నూకశాతంలో కోత విధించే నిబంధన ఎక్కడా లేదని, కేవలం రంగు మారిన, తేమ శాతం అధికంగా ఉన్న పొల్లు మాత్రమే కోతలు విధించే నిబంధన ఉందని, రైతులను ఇబ్బంది పెట్టేలా రైస్‌మిల్లర్లు వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి గుంటూరు పెద్దిరాజు, ఎంపిపిలు పూతినీడి వెంకటేశ్వరరావు, కర్రి వాసురెడ్డి, ఆచంట మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు సుంకర సీతారాం, నాయకులు పాల్గొన్నారు.


వేసవి వినోదంలో సైన్స్ ప్రయోగాలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

డివైఎఫ్ఐ, ఐద్వా సహకారంతో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి వినోదంలో భాగంగా మంగళవారం జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లుల శ్రీనివాసరావు చిట్టి సైన్స్ ప్రయోగాలు ప్రదర్శించారు. పిల్లలతో స్వయంగా చేయించి, సైన్స్ పట్ల అవగాహన, అభిరుచి కల్పించారు. చిన్న అభినయ గేయంతో పిల్లలను ఉత్సాహపరిచారు. సైన్స్ మ్యాజిక్ ద్వారా పిల్లలో మూఢనమ్మకాలు తొలగించి శాస్త్రీయ ఆలోచనపై అవగాహన కల్పించారు. మరో ముఖ్యఅతిథి జెవివి రాష్ట్ర నాయకులు త్రిమూర్తులురెడ్డి 'ఎందుకని.. ఎందుకని' అంటూ గీతం ఆలపించి పిల్లల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించేందుకు కృషి చేశారు. కార్యక్రమంలో బాలల సంఘం నాయకుడు రిషి, డివైఎఫ్ఐ నాయకులు భారతి, ప్రమోద్, మావో, సుమారు 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు.



సైన్స్ ప్రయోగాలు ప్రదర్శిస్తున్న శ్రీనివాసరావు



ఎంపిఇఒ కె.జ్యోతికి వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నేతలు

రైతులను ఆదుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - పెనుగొండ

ఆరుగాలం కష్టపడి పండించిన వరి పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం చేతులెత్తేసిందని , వాకిరి ఆదుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి ఎస్.వెంకటేశ్వరరావు విమర్శించారు. సిపిఎం నేతలు మంగళవారం దేవ గ్రామంలో ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అకాల వర్షాలు రైతులను నిండా ముంచాయన్నారు. ఆదుకోవాల్సిన ప్రభుత్వం క్వింటాకు అదనంగా 2.5 కేజీల తూకం ఇవ్వాలని హుకుం జారీ చేసిందని, నూక శాతం పేరుతో సంచితో 41 కేజీల నుండి 42 కేజీలకు ఒక కేజీని పెంచి పట్టుబడి పట్టాలని ఆదేశించిందని తెలిపారు. ప్రభుత్వం రైస్ మిల్లర్ల దయాదాక్షిణ్యాలకే రైతులను వదిలేసిందన్నారు. అదనంగా క్వింటాల్‌కు 2.5 కేజీలు తూకాన్ని వ్యతిరేకిస్తూ రైతు భరోసా కేంద్రం వద్ద ఎంపిఇఒ కె.జ్యోతికి వినతిపత్రం సమర్పించారు.


కూలీలతో మాట్లాడుతున్న జెసి రామ్ సుందర్‌రెడ్డి

రైస్ మిల్లులో జెసి తనిఖీ

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

పూలపల్లి గ్రామంలో శ్రీజయలక్ష్మి వెంకట నరసింహ రైస్ మిల్లును జిల్లా జాయింటు కలెక్టర్ ఎస్.రామ్ సుందర్‌రెడ్డి మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యం, మిల్లర్ల దగ్గరకు వచ్చిన వాహనాలను ఆయన పరిశీలించారు. ఒక లోడు దిగుమతికి ఎంత సమయం పడుతుంది, ఎంత మంది హమాలీలు పనిచేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. రైతుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారా అని ఆరా తీశారు. రైస్ మిల్లులో సీసీ కెమెరాలు ఉన్నాయా, అవి పనిచేస్తున్నాయా లేదా అని స్వయంగా పరిశీలించారు. జెసి మాట్లాడుతూ రైసు మిల్లుల నుంచి ఏమైనా ఇబ్బందులు వస్తే తన దృష్టికి తేవాలన్నారు. రైతులు ధాన్యం కొనుగోలు విషయంలో ఎటువంటి అపోహలూ పెట్టుకోవద్దన్నారు. ప్రతి గింజా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. రవాణా ఛార్జీల విషయంలో వాహనదారులు రైతులను ఇబ్బందులు పెడితే వెంటనే దగ్గర్లోని అధికారులకు తెలియజేయాలన్నారు. రైతులు నుండి కొనుగోలు చేసిన ధాన్యం సొమ్ము నిర్ణీత సమయంలో వారి ఖాతాల్లో జమవుతున్నాయన్నారు. రైతులకు అవసరమైన గోనె సంచులు ఆర్‌బికెల ద్వారా అందిస్తున్నామన్నారు. సంచుల కొరతలేదని తెలిపారు. జెసి వెంట ప్రత్యేక అధికారి, జిల్లా నీటి వనరుల శాఖ అధికారి పి.నాగార్జునరావు, తహశీల్దార్ సిహెచ్ పెద్దిరాజు, ఎంపిడిఒ సంగాని వెంకటేశ్వరరావు, ఎఒఎస్ అబ్దుల్ రహీమ్ పాల్గొన్నారు.

రైతు పక్షపాతి జగన్ : జెడ్‌పి ఛైర్మన్

ప్రజాశక్తి - పాలకొల్లు

ముఖ్యమంత్రి జగన్ రైతు పక్షపాతి అని, గతంలో ఎన్నడూ లేని విధంగా రైతుకు గిట్టుబాటు ధర కల్పిస్తున్నారని జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ చెప్పారు. పార్టీ కార్యాలయంలో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. అకాల వర్షాల కారణంగా రైతులు ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవమేనన్నారు. రైతుల ఇబ్బందులను నిమ్మల తన స్వార్థ రాజకీయాల కోసం వాడుకుంటున్నారని విమర్శించారు. ఆందోళనలో ఆయన రైతులు ఆత్మహత్యలు చేసుకునేలా ప్రేరేపించారని విమర్శించారు. జెడ్‌పిటిసి నడపన గోవిందరాజులు, గుణ్ణం నాగబాబు మాట్లాడారు. కార్యక్రమంలో వైసిపి నేతలు మైఖేల్‌రాజు, వెంకటరత్నం, సూర్యనారాయణ పాల్గొన్నారు.

సంచుల సరఫరాలో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి - పెనుమంట్ర

గోనె సంచుల్లేక రైతులు ఆర్‌బికెల చుట్టూ తిరుగుతున్నారని, సంచుల సరఫరాలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎపి కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షులు కె.సుబ్బరాజు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. బ్యాగ్‌కు 42 కేజీల ధాన్యం పట్టుబడులు పట్టాలని ఆదేశాలు వచ్చాయని, రెండు రోజుల నుంచి 42 కేజీలు కాడికి ధాన్యం పట్టుబడులు పడుతున్నారని తెలిపారు. ఈ విషయంలో ప్రభుత్వం రైతులకు సమాచారం ఇవ్వడంలో పూర్తిగా విఫలమైందన్నారు. అగ్రికల్చర్ ఎఒను వివరణ అడగ్గా ధాన్యం 40 కేజీలు సంచి బరువు 800 గ్రాములు తరుగు 200 గ్రాములు మొత్తం కలిసి 41 కేజీ మాత్రమే ధాన్యం పట్టుబడి పట్టాలని చెప్పడం జరిగిందన్నారు. ఇప్పటివరకు 42 కేజీలు ధాన్యం పట్టుబడి పట్టిన రైతులు, కౌలు రైతులు తూకంలో సరిచేసుకుని 41 కేజీకి మార్పులు చేసుకోవాల్సిందిగా చెప్పామన్నారు. రైతులు, కౌలు రైతులు గమనించాలని కోరారు.

ఆదర్శ మహిళ దుర్గాబాయ్ దేశ్ ముఖ్

భీమవరం రూరల్ :ఆదర్శ మహిళ దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ ప్రముఖ ఉపాధ్యాయిని సయ్యద్ షెహనాజ్ తెలిపారు. దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ వర్ధంతిని ప్రజా సంఘాలు మహిళా ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థలతో క్విట్ ఇండియా స్తూపం వద్ద జిల్లా సర్వోదయ మండలి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. దుర్గాబాయ్ వంటి మహిళా మూర్తిని భావితరాలకు తెలియజెప్పాలని చెరుకువాడ రంగసాయి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బట్టిప్రోలు శ్రీనివాస్, బొండా వెంకట సుబ్బారావు, అజయ్ వర్మ, చుక్కనశ్రీ, షేక్ చాన్ బాషా పాల్గొన్నారు.

మొరాయించిన శృంగవృక్షం రైల్వేగేటు

నిలిచిపోయిన వాహనాలు

ప్రజాశక్తి - పాలకోడేరు

శృంగవృక్షంలోని రైల్వే గేటు మాటి మాటికీ మొరాయించడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మంగళవారం ఉదయం రైలు వెళ్లిన తరువాత గేటు తీసే క్రమంలో ఒక వైపు గేటు పైకి లేవకపోవడంతో వాహనాలు నిలిచిపోయాయి. ఈ గేటు వద్ద మాటిమాటికీ ఇలానే జరుగుతున్నా రైల్వే అధికారులు పట్టించుకోవడంలేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఇక్కడ ట్రాక్ మధ్య భాగంలో గుంతలు ఉండటం, ట్రాక్ మధ్య రహదారి ఒంపు సరిగా లేకపోవడం వల్ల నిత్యం ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతోందని ప్రయాణికులు చెబుతున్నారు. రైల్వే ఉన్నతాధికారులు స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలని వాహనదారులు కోరుతున్నారు.


నిలిచిపోయిన ట్రాఫిక్

అడుగడుగునా దగా..!

1153 రకం ధాన్యం కొనుగోలుకు మిల్లర్ల నిరాకరణ

రైతుల అవస్థలు

ప్రజాశక్తి - వీరవాసరం

ఆరుగాలం కష్టపడి దేశానికి అన్నం పెడుతున్న రైతన్న అడుగడుగునా దగాపడుతున్నాడు. గతంలో ఎన్నడూలేని విధంగా ఈసారి అన్ని విధాలా పద్మవ్యూహంలో చిక్కుకుని విలవిల్లాడిపోతున్నాడు. తాను పండించిన పంటను అమ్ముకోవడానికి నానా కష్టాలు పడుతున్నాడు. ఒక పక్క పండించిన పంట నాణ్యతలేకపోవడం, మరో పక్క ప్రకృతి ప్రతికూల పరిస్థితుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు. దీనికితోడు అధికారులు, మిల్లర్లు సహకరించకపోవడంతో దాళ్వాలో చేతికొచ్చిన పంట అమ్ముకోవడానికి రైతులు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. ఒక పక్క రైతులను అన్ని విధాలా ఆదుకుంటామంటూ ప్రభుత్వం భరోసా ఇస్తున్నా అది క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదంటూ రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం ఆర్‌బికెల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తోంది. వ్యవసాయ క్షేత్రంలో టెక్నీషియన్‌తో ధాన్యం నాణ్యత నిర్ధారించి మిల్లుకు తీసుకెళ్తున్నా అక్కడ నాణ్యత లేదంటూ ధాన్యం తీసుకోవడానికి మిల్లర్లు నిరాకరిస్తున్న సందర్భాలు ఉన్నాయి. దీంతో గత్యంతరంలేని స్థితిలో మిల్లర్లు చెప్పిన ధరకే ధాన్యాన్ని తెగనమ్ముకోవాల్సి వస్తోంది. బస్తాకు కొంత చొప్పున ధాన్యం తగ్గించడం లేదా బస్తాకు రూ.వంద నుండి రూ.200 నగదు చెల్లిస్తేనే ధాన్యం తీసుకుంటామంటూ మిల్లుల వద్ద ఖరాఖండిగా చెబుతున్నారని మత్స్యపురికి చెందిన రైతులు భాస్కరరావు, పోతుల సురేష్ వాపోయారు. ఇదిలాఉంటే ఇటీవల కురుస్తున్న వర్షాల వల్ల ఎకరం పంట కోయడానికి సుమారు నాలుగు గంటలు పడుతుందని, దీనికి అద్దె చెల్లించడానికి సుమారు రూ.5 వేలు అదనదంగా చెల్లిస్తున్నామని తెలిపారు. దీంతో దాళ్వాలో పెట్టిన పెట్టుబడులు రాక అప్పులు మిగులుతున్నాయంటూ వాపోయారు.


మత్స్యపురిలో ధాన్యం పడుతున్న రైతులు

వ్యవసాయాధికారుల నిర్లక్ష్యం !

1153 రకం ధాన్యం నాణ్యత ఉండదని తెలిసి కూడా పంట కాల వ్యవధి తక్కువ కావడం, సాగు చివరి కాలంలో సాగునీటి కొరత నుంచి తప్పించుకోవచ్చనే ఆలోచనతో మత్స్యపురిలోని పలువురు రైతులు ఈ రకాన్నే సాగు చేశారు. అయితే సాగునీటి ఇబ్బందులేని ప్రాంతాల్లో కూడా 1153 రకాన్నే సాగు చేయడం గమనార్హం. ఈ రకంపై రైతులకు అవగాహన కలిగించడంలో వ్యవసాయాధికారులు విఫలమైనట్లు తెలుస్తోంది. ఫలితంగా మండలంలో అధిక శాతం 1153, 1156 రకాన్ని సాగు చేసిన రైతులు నేడు తమ పంటను అమ్ముకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి డిమాండ్ ఉన్న రకాలను రైతులచే సాగు చేయించడంలో చర్యలు తీసుకోవాలని, ఆ దిశగా సన్నద్ధం చేయాలని పలువురు కోరుతున్నారు.

అవినీతికి కేరాఫ్ అడ్రస్ వైసిపి : బిజెపి

ప్రజాశక్తి - పాలకోడేరు

వైసిపి ప్రభుత్వం అవినీతి అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిందని, ఈ నేపథ్యంలో జగన్ అవినీతి ప్రభుత్వంపై ఛార్జిషీట్ దాఖలు చేయనున్నట్లు బిజెపి రాష్ట్ర కార్యదర్శి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ స్పష్టం చేశారు. పెన్నాడలో బిజెపి ఎస్‌సి మోర్చ జిల్లా కార్యదర్శి ప్రసాదం ఏడుకొండలు నివాసం వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో భూపతిరాజు శ్రీనివాసవర్మ మాట్లాడారు. ప్రజా ప్రయోజనాలను, పాలనను జగన్ ప్రభుత్వం గాలికి వదిలేసిందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను జగన్ విస్మరించారని విమర్శించారు. కేంద్ర పథకాలకు పేర్లు మార్చి స్టికర్లు అంటిస్తూ.. బటన్ నొక్కుతూ మనుగడ కొనసాగిస్తోందన్నారు.బిజెపి ఉండి నియోజకవర్గ సమన్వయకర్తగా కోరా రామమూర్తిని నియమించినట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి పేరిచర్ల సుభాష్, జిల్లా ఉపాధ్యక్షురాలు లక్ష్మీపార్వతి, ఎస్‌సి మోర్చా జిల్లా అధ్యక్షుడు ఇంజేటి వెంకటేశ్వర్లు పాల్గొనారు.

ధాన్యం కొనే వరకూ పోరాడతాం : పితాని

ప్రజాశక్తి - పెనుమంట్ర

తడిసిన, మొలకెత్తిన ధాన్యం కొనుగోలు చేసే వరకూ ప్రభుత్వంపై పోరాటం చేస్తామని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ తెలిపారు. మార్టేరు వేణుగోపాలస్వామి ఆడిటోరియంలో మంగళవారం నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పితాని సత్యనారాయణ మాట్లాడుతూ స్విచ్ నొక్కే ముఖ్యమంత్రికి రైతులగోడు ఏం వినిపిస్తుందని విమర్శించారు. రైతుల సమస్యలు పరిష్కరించడం లేదన్నారు. అకాల వర్షాల వల్ల తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని కూడా ఆన్‌లైన్‌లో కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు పూర్తిస్థాయిలో గోనె సంచులు సరఫరా చేయాలన్నారు. కొనుగోలు చేసిన 21 రోజుల్లో సొమ్ము బ్యాంకు ఖాతాలో జమ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆచంట జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్‌బాబు, ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, పార్టీ నాయకులు తమనుపూడి శ్రీనివాస్ రెడ్డి, కేతా మీరయ్య పాల్గొన్నారు.

పార్టీ కార్యక్రమాలను వివరించాలి : జనసేన

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

వార్డు ఇన్‌ఛార్జులు, మెంబర్లు ప్రతి ఇంటికీ వెళ్లి జనసేన కార్యక్రమాలను వివరించాలని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొలిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. వార్డు, పట్టణ కమిటీ మెంబర్ల అత్యవసర సమావేశం మంగళవారం స్థానిక జనసేన కార్యాలయంలో ఏర్పాటు చేశారు. కొత్తగా ఎన్నికైన పార్టీ పట్టణ, వార్డు ఇన్‌ఛార్జులకు, వార్డు మెంబర్లకు బొలిశెట్టి శుభాకాంక్షలు తెలిపి మాట్లాడారు. పార్టీ ఓడిపోయినా నాలుగేళ్లుగా తన వెన్నంటే ఉన్నవాళ్లందరికీ ధన్యవాదాలు తెలిపారు. ప్రతి వార్డులో సమస్యలను తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో వర్తనపల్లి కాశీ, బొలిశెట్టి రాజేష్, పైబోయిన వెంకటరామయ్య, అడబాల నారాయణమూర్తి పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న సర్పంచి సుంకర సీతారామ్

ఉత్తమ విద్యార్థులకు సత్కారం

ప్రజాశక్తి - ఆచంట

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు సుంకర సీతారామ్ తెలిపారు. పది ఫలితాల్లో కొడమంచిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన పెదపూడి.సుప్రియ (541), వర్ధనపు స్పందన (449), చికిలే.సౌజన్య (442)ను పంచాయతీ కార్యాలయంలో మంగళవారం సత్కరించారు. అనంతరం అంబేద్కర్ పుస్తకాలను అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సీతారామ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీష్ మీడియం చదువుకున్న అధిక మంది ఉత్తీర్ణత సాధించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు కాండ్రేగుల సత్యనారాయణ, గ్రామ కార్యదర్శి హినా భాను, ఎస్‌ఎంసి ఛైర్మన్ బొరుసు రాంబాబు, ఉపాధ్యాయులు చిరంజీవి, టి.సీత పాల్గొన్నారు.

రంగు మారిన ధాన్యం కొనుగోలు చేయాలి

రాష్ట్ర రైతు కార్యాచరణ సమితి ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

తడిచిన, రంగు మారిన ధాన్యాన్ని తక్షణం ప్రభుత్వం కొనుగోలు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని రాష్ట్ర రైతు కార్యాచరణ సమితి ప్రధాన కార్యదర్శి లంకా కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. భీమవరంలో ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. ఇటీవల కురిసిన అకాల వర్షాల వల్ల ధాన్యం చాలా చోట్ల తడిచిపోయి రైతులు నానా అవస్థలు పడుతున్నారన్నారు. ప్రకృతి విపత్తు అయినప్పటికీ ధాన్యం కొనుగోళ్లలో, సంచులు అందించడంలో, వాహనాలు సమకూర్చకపోవడంలో, బరకాలు, టార్పాలిన్‌లు ఇచ్చి రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. రైతులకు జరిగిన నష్టానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. నిబంధనలు సడలించి రంగు మారిన, తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. నూక శాతం పేరుతో రైతుల నుంచి కొనుగోలుదారులు అడ్వాన్స్ వసూలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం తక్షణం రైతులను ఆదుకోవాలని కోరారు.

జెసితో రోడ్లు, భవనాల శాఖ కార్యదర్శి సమీక్ష

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

రాష్ట్ర రవాణా, రోడ్లు, భవనాల శాఖ సెక్రటరీ పిఎస్ ప్రద్యుమ్న మంగళవారం విజయవాడ నుంచి కాకినాడ పర్యటన నేపథ్యంలో మార్గ మధ్యలో పాలకొల్లు మండలం దిగమర్రు వచ్చారు. ఈ నేపథ్యంలో రోడ్ల పరిస్థితిపై జెసి ఎస్.రామ్‌సుందర్ రెడ్డితో సమీక్షించారు. రహదారులు ఎంత వరకూ వేశారు, ఎంత వరకూ వేయాల్సి ఉంది వంటి విషయాలను అడిగి తెలుసుకున్నారు. దానికి సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జాతీయ రహదారి ఎస్ఇ సత్యనారాయణ, ఇఇ సంజీవ రాయుడు, ఆర్అండ్‌బి శాఖ జిల్లా అధికారి ఎస్.లోకేశ్వరరావు పాల్గొన్నారు.


మ్యాప్ పరిశీలిస్తున్న భవనాల శాఖ కార్యదర్శి ప్రద్యుమ్న

గ్రంథాలయాలు విజ్ఞాన బాండాగారాలు

ఉండి:గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని గ్రంథాలయ విశ్రాంత పాలకుడు ముదునూరి మహంకాళి రాజు అన్నారు. మంగళవారం స్థానిక గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరంలో హాజరైన మహంకాళి రాజు మాట్లాడారు. గ్రంథాలయాలు విజ్ఞాన బాండాగారాలని, విద్యార్థులు గ్రంథాలయాల్లోని పుస్తకాలను చదివి విజ్ఞానవంతులవ్వాలన్నారు. విద్యార్థులు గ్రంథాలయాల ఆవశ్యకతను తెలుసుకొని సెల్‌ఫోన్లను విడనాడాలన్నారు. అనంతరం విద్యార్థులకు బిస్కెట్లు, మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమానికి విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరైనట్లు గ్రంథాలయ అధికారి జెవి కృష్ణమూర్తి తెలిపారు.

నరసాపురం టౌన్ : నరసాపురం ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం మంగళవారం కొనసాగింది. ఈ సందర్భంగా పిల్లల చేత ముందుగా పుస్తక పఠనం చేయించారు. పద్యాలు, మోటివేషనల్, గణితంలో మెలకువలు, ధ్యానం, యోగా క్లాసులు నిర్వహించారు. మున్సిపల్ స్కూల్ హెచ్ఎం కె.వెంకటేశ్వరరావు, సుధీర్ మోహన్, సూర్యంబాబు, భట్టిప్రోలు సత్యనారాయణ, మోటివేషనల్ స్పీకర్ నాగశ్రీ, రిసోర్స్ పర్సన్స్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యార్థులు పాటించాల్సిన నియమాల గురించి వివరించారు. జూన్ 11 వరకూ జరిగే శిక్షణ తరగతుల్లో పిల్లలందరూ పాల్గొనాలని గ్రేడ్‌వన్ లైబ్రేరియన్ కెజెఎస్ఎల్ కుమారి కోరారు.

తణుకు : వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం స్థానిక పురుషుల శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. పుస్తక పఠనంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మొగల్తూరు:మొగల్తూరు 216 జాతీయ రహదారిపై జరిగిన రహదారి ప్రమాదంలో గాయపడిన యువకుడు ఆసుపత్రులో చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతి చెందాడు. ఎస్ఐ ఎం.వీరబాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. భీమవరంలోని కొవ్వాడ పుంతకు చెందిన బొండాడ చరణ్ రవితేజ వరుసకు సోదరి అయిన నూకల అనూషతో ద్విచక్ర వాహనంపై పసలదీవి వెళ్తూ మొగల్తూరులోని పెట్రోల్ బంక్ సమీపంలో రోడ్డుపై నిలిపిన ట్రాక్టర్ ట్రక్కును ఢీకొట్టాడు. దీంతో ఇరువురు తీవ్ర గాయాల పాలయ్యారు. వారిని చికిత్స నిమిత్తం అత్యవసర వాహనంలో నరసాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి వైద్యులు సూచనల మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం భీమవరంలోని ప్రయివేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చరణ్ రవితేజ మృతి చెందాడు. అనూష అదే ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. చరణ్ రవితేజ తండ్రి మాధవ కృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు ఇవ్వాలని వినతి

పాలకొల్లు:జర్నలిస్టులకు గతంలో వలే విరివిగా అక్రిడేషన్లు మంజూరు చేయాలని పాలకొల్లు ప్రెస్‌క్లబ్ సభ్యులు మంగళవారం జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్‌ను కోరారు. అనంతరం జెడ్‌పి ఛైర్మన్‌కు ప్రెస్ క్లబ్ సభ్యులు వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వాలు అక్రిడేషన్లు ఎక్కువగా మంజూరు చేసేవని, నాలుగేళ్లుగా ప్రభుత్వం నిబంధనలు కఠినతరం చేసిందని పాత్రికేయులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఉన్నతాధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటానని శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో ఎపియుడబ్ల్యుజె జిల్లా ఉపాధ్యక్షులు పిటి వెంకటేశ్వరరావు, సీనియర్ జర్నలిస్టులు బుడ్డిగ గోపి, మండెల అప్పలరాజు, రవి, శాంతారావు, చిన్ని, భాస్కర రావు పాల్గొన్నారు.